వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 300
గురువారం | 13 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



2లో

# మీలో ఒక్కడిగా ఉంటా..

మీ కష్టాల్లో పాలు పంచుకుంటా..

హమాలీ సంఘం సమావేశంలో దాస్యం వినయ్ భాస్కర్

## అట్టహాసంగా ప్రారంభమైన

# జర్నలిస్టుల క్రీడోత్సవాలు



8 లో..



- నాలుగు రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- 3 కే రన్ విజయవంతం
- ఎంపీ కడియం కావ్య బ్యాటింగ్.. ఎమ్మెల్యే నాగరాజు బౌలింగ్



శరవేగంగా నయీంనగర్ బ్రిడ్జి పనులు


పూర్తి అయిన నాలా కొనసాగుతున్న స్లాబ్

వరదలు వచ్చినా ఇబ్బందులు ఉండవంటున్న ఇంజినీర్లు

చకచకా సాగుతున్న పనులపై జనం హర్షం

# ముంపు తప్పింది

వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నయీంనగర్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వరదలు రాకముందే నాలా పనులను పూర్తి చేయడం ద్వారా ముంపునుంచి రక్షణ పొందవచ్చన్న ఆలోచనతో కాంట్రాక్టర్ రాత్రింభవళ్లు పనులు చేయిస్తున్నారు. అనుకున్నట్టుగానే కాలువ నిర్మాణ పనులను పూర్తి చేశారు. రెండు వైపులా సిమెంట్, కాంక్రీట్, స్టీల్‌తో పక్కాగా సైడ్ కాల్వల పని పూర్తయింది. మరో రెండు, మూడు రోజుల్లో స్లాబ్ పనులుకూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికిప్పుడు భారీ వర్షాలు పడినా నీరు సక్రమంగా వేళ్లేందుకు పూడిక తీత పనులు కూడా పూర్తి చేశారు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీంతో నయీంనగర్ ప్రాంతానికి ముంపు బాధలు తీరినట్లేనని స్థానికులు భావిస్తున్నారు. చకచకా సాగుతున్న పనులపై జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- వరంగల్ వాయిస్, హనుమకొండ



వివరాలు 2లో..



2లో

# మంత్రి సురేఖకు సమస్యల ఏకరువు

క్యాంపు కార్యాలయానికి పోటెత్తిన జనం



2లో..

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రాష్ట్ర మంత్రి సీతక్క



# ముంపు తప్పింది

- శరవేగంగా నయింనగర్ బ్రిడ్జి పనులు
- పూర్తి అయిన నాలా
- కొనసాగుతున్న స్లాబ్
- వరదలు వచ్చినా ఇబ్బందులు ఉండవంటున్న ఇంజినీర్లు
- చకచకా సాగుతున్న పనులపై జనం హర్షం



**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** వానాకాలం వచ్చిందంటూ హనుమకొండలోని నయింనగర్ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది. వరద నీటిలో కాలనీలన్నీ తేలియాడేవి. హనుమకొండ-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై నీరు నిలువడంతో రెండు, మూడు రోజులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 50 సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించిన బ్రిడ్జిని తొలగించి ఇదే స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించేందుకు రెండున్నర నెలల క్రితం అడుగులు పడ్డాయి. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వరదలనుంచి ఈ ప్రాంతాలను కాపాడాలన్న లక్ష్యంతో శరవేగంగా పనులు ప్రారంభించడంతో పాటు రాత్రింభవళ్లు పనులు చేయించడంపై జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రూ.8.50 కోట్లతో పనులు..

కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నయింనగర్ నాళా విస్తరణకు స్మార్ట్ సిటీ ఫండ్ నుంచి రూ.8.50 కోట్లు కేటాయించారు. గతంలో 16 మీటర్ల వెడల్పు ఉన్న బ్రిడ్జిని ఇప్పటి జనాభాకు అనుగుణంగా 24.5 మీటలర్లు వెడల్పు చేయనున్నారు. వరద నీరు కిందినుంచి సాఫీగా వెళ్లేలా 10 మీటర్ల అడుగుతో మూడు ఖానాలు ఏర్పాటు చేయనున్నారు. 32 మీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ బ్రిడ్జిలో చివరి రెండు పిల్లర్లతో సంబంధంలేకుండా మధ్యలో రెండు బలమైన పిల్లర్ల నిర్మాణం చేపట్టారు.

### ప్రమాదం తప్పినట్లే..

హనుమకొండ-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై న్యారోగా ఉన్న బ్రిడ్జిని తొలగించి రానున్న 20 సంవత్సరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన బ్రిడ్జి నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. వర్షాకాలంలోపే దీనిని పూర్తి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో కంట్రాక్టర్ 24/7 పనులు చేయిస్తున్నారు. నాలా విస్తరణ, బ్రిడ్జి ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది పూర్తయితే హనుమకొండలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురికాకుండా ఉంటాయి. అందుకు అనుగుణంగానే వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు వీలుగా పూడిక తీత పనులు పూర్తి కావడంతో ఇప్పటికిప్పుడు భారీ వర్షాలు పడినా ఎలాంటి ముంపు సమస్య ఏర్పడదని ఇంజినీర్లు ప్రకటిస్తున్నారు. దీనిని సంబంధించిన నాలా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండు వైపుల సిమెంట్, కాంక్రీట్, స్టీల్ లో పక్కాగా సైడ్ కాల్వలు పూర్తి చేశారు. త్వరలోనే స్లాబ్ పనులు కూడా చేపట్టనున్నారు. అందరికీ ఉపయుక్తంగా ఉండే నయింనగర్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# మంత్రి సురేఖకు సమస్యల ఏకరువు

## క్యాంపు కార్యాలయానికి పోటెత్తిన జనం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ఓ సిటీలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రజలను నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొన్నటిదాకా ఎలక్షన్ కోడ్ కారణంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించే అవకాశం లేకపోయింది. అయితే నేడు మంత్రి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తుడంటంతో పెద్ద ఎత్తున ప్రజలు క్యాంఫ్ ఆఫీసు కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న మంత్రి సురేఖ సాధ్యమైనంతవరకు సంబంధిత శాఖల అధికారులతో అప్పటికప్పుడే ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కార మార్గం చూపించారు. దీర్ఘకాలంగా వేచి చూస్తున్న తమ సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్యలున్నా ప్రజలు నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చునని ఈ సందర్భంగా మంత్రి సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. మంత్రికి పలువురు పూల మొక్కలు అందించి అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## రాష్ట్ర మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని, అక్కడే విద్యార్ధులకు నాణ్యమైన విద్య లభిస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సాతక్క అన్నారు. ప్రతి పేదవాడికి ఉచితంగా నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గురువారం బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, ఉచిత భోజనం, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఉచిత వసతితో పాటు కాస్మెటిక్స్ అందజేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. ని విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 1,71,150 ఉచిత పాఠ్య పుస్తకాలకు గాను 1,42,510 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 95,913 ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ములుగు ఎంపీపీ గండ్ర కోట శ్రీదేవి, డీఈఓ పాణిని, డీఎస్పీ రవీందర్, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి, ఎంఈఓలు, విద్యార్థులు, పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

# మీలో ఒక్కడిగా ఉంటా..

## మీ కష్టాల్లో పాలు పంచుకుంటా..

## హమాలీ సంఘం సమావేశంలో దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం హమాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమంగా ధ్యేయంగా నిరంతరం పని చేస్తానన్నారు. కార్మికుల అభివృద్ధి కోసం అనేక సంఘాలతో నిరంతరం మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని, మీ సమస్యలకు కూడా పరిష్కరించే దిశగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. మీ సమస్యలను ఓనర్స్ దృష్టికి తీసుకువెళ్లి హమాలీల కూలీల రేట్లు పెంచేందుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఏంజాల మల్లేశం, మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సంజీవ్, ట్రేడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాదరబోయిన కొమురయ్య, ఉపాధ్యక్షులు గోంగళ్ల వెంకన్న, కార్యదర్శి సన్నబోయిన రవి, కార్యవర్గ సభ్యులు మల్లేష్, రాంమ్మూర్తి, కుమారస్వామి, రాములు, కొండయ్య, యాకయ్య, అంజయ్య, రాజు, దేవేందర్ తోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



# ఎంపీని కలిసిన అనాథ ఆశ్రమం చిన్నారులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ అతిథి దివ్యాంగుల ఆశ్రమం చిన్నారులు గురువారం కనకదుర్గ కాలనీలోని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన కడియం కావ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి వారితో కొద్ది సేపు ముచ్చటించారు. చిన్నారుల ఆరోగ్యంతో పాటు వారి చదువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు.

## బయ్యారం ఉక్కు ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

### సీపీఐ నేతలు విజయసారథి, ఆకుల రాజు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆంధ్రప్రదేశ్ విభజన ఉమ్మడి హక్కు చట్టం 2014 ప్రకారం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ వాముపక్ష పార్టీల ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ సందర్భంగా అక్రమంగా వామపక్ష నేతల కార్యకర్తలపై లాఠీచార్జీ చేసి, అక్రమ కేసులు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం పెట్టిన నేపథ్యంలో నేడు వామపక్ష పార్టీల నేతలు కార్యకర్తలు మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.విజయసారథి ఆకుల రాజులు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు విభజన చట్టంలో హామీని నెరవేర్చలేదన్నారు. బీజేపీ ఎంపీలు కనీసం పార్లమెంట్ లో బయ్యారం ఉక్కుపై మాట్లాడలేదన్నారు. ఆందోళన నిర్వహించిన వామపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వెంటనే వామపక్ష నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేంద్రంతో మాట్లాడి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించేందుకు కృషి చేయాలని అన్నారు. హాజరైన వారిలో వామపక్ష నేతలు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, సమ్మెట రాజమౌళి, సామ పాపయ్య, వరిపెల్లి వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, పోగుల శ్రీనివాస్, చౌప్పరి శేఖర్, మేక వీరన్న, తండ మాధవి, కనకం పద్మ పాల్గొన్నారు.

## శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీఆర్ఎస్ జిల్లా నాయకులు, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ మాజీచైర్మన్, పీఎస్ఆర్ కన్వెన్షన్ అధినేత పర్కాల శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ ఎడ్ల వేణుయాదవ్, కరుణాకర్ రెడ్డి, రాజ్ కుమార్, చౌడవరపు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకుమహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 42 కేసులు నమోదు చేయడం జరిగింది. అలాగే, రూ.1,60,800 విలువ చేసే 402 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, రూ.11,10,000 విలువ చేసే 11100 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో అధికారులు, సిబ్బంది కలిపి 142 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా పరిధిలో నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించి 42 కేసులు నమోదు చేసి, 402 లీటర్ల నాటు సారా, 11100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా స్థావరాలకు చోటు లేదని, ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పటిక బెల్లం అక్రమ రవాణాపైన దృష్టి పెట్టాలన్నారు. గుడుంబా వల్ల జరిగే నష్టాలను అన్ని గ్రామాల్లోని ప్రజలకు, తయారీదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ దాడుల్లో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

# నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ఉదాసీనత వైఖరి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ రైతాంగానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రగతిశీల అఖిల భారత రైతు సంఘం ఏఐపీకేస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చంద్రన్న అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ లెనిన్ కు ప్రతినిధి బృందం వినతిపత్రం ఇచ్చింది. ఈ సందర్భంగా చంద్రన్న ప్రసంగిస్తూ రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందించడంలో తగిన శ్రద్ధ రాష్ట్ర ప్రభుత్వం చూపలేదన్నారు. ఫలితంగా టన్నుల కొద్దీ విత్తనాలు తనిఖీల్లో బయటపడ్డాయని పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపెనీలను నియంత్రించలేదని మండిపడ్డారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్న విత్తన డీలర్స్, దళారీలు, అనధికార షాపుల యజమానులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. నకిలీ విత్తనాలను అమ్మిన వారిపై పిడి యాక్ట్ లాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చంద్రన్న డిమాండ్ చేశారు. రెండు లక్షల రైతాంగానికి వెంటనే అమలు చేసి కొత్త రుణాలు యుద్ధ ప్రాతిపదికను అందించాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నియమం ప్రకారం వివిధ వాణిజ్య బ్యాంకులు రైతులకు 11 శాతం అప్పులు ఇవ్వాలన్నారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.30,000, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50 వేల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. రకరకాల కారణాలతో బ్యాంకులు రైతులకు అప్పులు ఇవ్వక అధిక వడ్డీకి ప్రైవేటు వ్యాపారుల దగ్గర తెచ్చుకుంటున్న రైతులు పంటలు సరిగా రాక అప్పులు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడటం, వలసలు పోవడం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన కుంభకోణాలను జ్యుడీషియల్ విచారణ జరిపి దోక్షులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతి శీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్కూరు జగ్గన్న, సీపీఐ (ఎంఎల్ ) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం రైతు పంటకు గిట్టుబాటు ధరలు నిర్ణయించి ముందే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు ముజంపల్లి వీరన్న, బిల్లా కంటి సూర్యంతో పాటు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఉమాగాని సత్యం, ఐఎఫ్ టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు పైండ్ల యాకయ్య, పల్లెల పాపారావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందాల రంగయ్య, ఇరుగు అనిల్ తో పాటు దొడ్డ రాజు, ఆలకుంట్ల కొమరయ్య, తుపాకుల వెంకన్న, వీరబోయిన సైదులు, గుగులోతు భిక్షం, ఎండీ మౌలానా, వీరన్న తదితరులు పాల్గొన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ మీ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

## బడి ఈడు పిల్లలను బడికి పంపాలి

### కార్పొరేటర్ బోగి సువర్ణ-సురేష్



**వరంగల్ వాయిస్, తూర్పు కోట :** ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ లను స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, స్కూల్ హెడ్ మాస్టర్ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ స్కూల్ పథకం కింద రూ.3 లక్షల 30 వేలతో స్కూల్ లో ఐరన్ డోర్స్, ప్రహరి గోడ, వాటర్ సప్లయ్, బాత్రూమ్, హ్యాండ్ వాష్ సింక్, వాటర్ సంపు, కరెంట్ పనులు తదితర పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సువర్ణ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్ లతో పాటు మధ్యాహ్నం భోజనం పెట్టి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నారని అన్నారు. కాబట్టి, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సిబ్బంది, పేరెంట్స్ కమిటీ, స్థానికులు విజయ్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నోట్ బుక్స్ దందాను అరికట్టాలి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం చెన్నారావుపేట పరిధిలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తూ పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థులను నిలువు దోపిడి చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓ రత్నమాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట డివిజన్ కన్వీనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను అంగడి సరుకుగా మార్చేశాయనిఆరోపించారు.తక్షణమే నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం పరిధిలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలలో సాగుతున్న పాఠ్య పుస్తకాల దందాను అరికట్టాలని వారు ఎంఈఓకు వినతిపత్రంలో కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో జాటోతు గణేష్ ఉన్నారు.

# ఆశాలకు ఎగ్జామ్స్ నిర్ణయాన్ని రద్దు చేయాలి

### కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గత అనేక సంవత్సరాలుగా ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తూ, అనుభవాన్ని గడించిన ఆశా వర్కర్లకు మళ్లీ కొత్తగా ఎగ్జామ్స్ పెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 33 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన అనేక రకాల ట్రైనింగులు పొందారని తెలిపారు. రిజిస్టర్లు రాయడం, ఆన్ లైన్ పనిచేయడం, ప్రజలకు మందులు అందజేస్తూ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలతో పాటు ప్రజలందరికీ ఆరోగ్య సేవలు క్షేత్రస్థాయిలో అందిస్తున్నారని వివరించారు. కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డు కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇన్ని పనులు చేస్తూ ఇంత సీనియార్టీ ఉన్న ఆశాలకు కొత్తగా ఎగ్జామ్స్ పెట్టి వారి జ్ఞాపకశక్తిని మరల నిరూపించుకోమని చెప్పడం సమంజసం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎగ్జామ్స్ నిర్వహించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా ఆశాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేసిన ఫలితంగా అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రద్దు చేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం లాంటి హామీల అమలుకు పూనుకోవాలే కానీ, ఆశాలకు కొత్త సమస్యలు తెచ్చి పెట్టడం తగదన్నారు. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, ప్రతి నెల రెండవ తేదీన వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్ మెంట్ సౌకర్యం కల్పించాలని, ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, అంత్యక్రియలకు రూ. 50వేలు చెల్లించాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలతో పాటు సగం వేతనం పెన్షన్ గా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు పనిభారం తగ్గించాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోతుగంటి మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశ యూనియన్ జిల్లా నాయకులు ఉపేంద్ర, సుజిత, కాలేశ్వరి, ఆసియా, సునిత, రమ, నిర్మల, జ్యోతి, సంధ్య, పుష్ప, ప్రమీల, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను ఇబ్బందులకు గురి చేయొద్దు

## ఎగ్జామ్స్ తక్షణమే ఉపసంహరించుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి మాట్లాడుతూ ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాల నుంచి మైదాన ప్రాంత జిల్లాలో 13 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగులు పొందారు. రిజిస్టర్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్ లైన్ పనిచేయడం ద్వారా వర్కర్స్ కు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తు తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు వివరిస్తున్నారని అన్నారు. వీటితోపాటు గర్భిణీ బాలింతలు చిన్న పిల్లలకు ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. కరోనా మామారి కాలంలో కరోనాకు భయపడకుండా నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారన్నారు. అదేవిధంగా అనేక సంవత్సరాల నుంచి కనీస వేతనాలు అమలు కాక దుర్భరమైన జీవితాలు గడిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ ను పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆశల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీలను ఇన్సూరెన్స్ రూ. 50 లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చులు రూ.50 వేల రూపాయలు చెల్లించాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మీరు తీసుకున్న ఎగ్జామ్స్ వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏవో శ్రీకాంత్ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాణి, వి.ఉషారాణి, సుజాత, మాధవీలత, రమ, పద్మ, మాధవి, రమాదేవి, మరియా, రజిత, ఆయూష, రాజేశ్వరి, కారుణ్య, స్వప్న, రమా తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో దొంగల బీభత్సం

## అర్ధరాత్రి పూజారి ఇంట్లో చోరీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ సృష్టించారు. మండల కేంద్రానికి చెందిన పూజారి ఇంట్లో భారీ బంగారం నగదును అపహరించారు. వివరాల్లోకి వెళితే సముద్రాల సురేష్ పద్మావతి దంపతులుమూడు రోజుల క్రితం అత్యవసర పనులపై హైదరాబాద్ లో ఉన్న వారి కూతురు వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు వారి ప్రహరీ గోడ మీది నుంచి వెళ్లి ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం, 5వేల నగదును దోచుకెళ్తుండగా ప్రహరీ గోడ నుంచి శబ్దం వినిపించగా ఇంటి పక్కనే ఉన్న ప్రశాంత్, చారి, భరత్ అనే ముగ్గురు యువకులు గమనించి వారిని వెంబడించారు. దీంతో దొంగలు వెనుకనున్న మసీదు దారి నుంచి తప్పించుకున్నారు. ఊరిలో ఉన్న మరికొందరికి సమాచారం అందించి అందరూ కలిసి గాలించగా వాటర్ ట్యాంక్ పక్కన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా బైక్ పార్క్ చేసి ఉంది. దీంతో పోలీస్ వారికి సమాచారం అందించగా వారు దానిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఆచార్యులు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌యాదవ్, ఎస్సై, పోలీస్ సిబ్బంది, క్లూస్‌టీంతో కలిసి ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరపాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శివనగర్ లోని అండర్ బ్రిడ్జి వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నీట్ లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్ల కార్డులతో నిరసన తెలిపారు. అనంతరం (ఏఐఎస్ఎఫ్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని మే 5న పరీక్షను నిర్వహించడం జరిగిందని, దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారని, ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలకు ప్రత్యక్ష సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారందరిది పరీక్షా కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుందన్నారు. కాబట్టి, తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై,పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, అభిరామ్, రాజు, సంతోష్, రమేష్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగాన్ని ఆదుకోవాలి

## సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

### రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టి.వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేతన్నలందరికీ చేతినిండా పని కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, చేనేత రంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని కార్యాలయంలో జరగగా రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి జనార్ధన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమైన చేనేత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంక్షోభంలో ఉందన్నారు. కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నలు నేసిన వస్త్రాలు సహకార సంఘాల దగ్గర నిల్వలు పేరుకుపోయాయని, ప్రభుత్వం వాటన్నిటిని కొనుగోలు చేయాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించక సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందని, ఈ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా వెంటనే ఎన్నికలు జరిపించాన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా కార్మికులకు రూ.రెండు లక్షలు ముద్ర లోన్స్ ఇవ్వాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మినర్సయ్య ప్రసంగిస్తూ ప్రభుత్వం చేనేత మిత్ర, చేనేతకు చేయూత పథకాలను కొనసాగించాలని, కార్మికులకు నూతన ఆధునీకరణ మగ్గాలు ఇప్పించాలని, ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ మాఫీ చేసి వడ్డీ లేని కార్పస్ ఫండ్ ఇవ్వాలన్నారు. జల్ది రాములు, చేపూరి ధనుంజయ, యల్.యాదగిరి, కె. భిక్షపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ లోని బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. గురువారం ఉర్సు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ద్వారా వచ్చిన పాఠ్యపుస్తకాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, అంతేకాకుండా స్కూలు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవడానికి గాను పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.పూసారాం, ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీకాంత్, సతీష్, విజయ, స్వామి, సాలార్ లతో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆర్థిక స్తోమత లేక రోగాల బారిన పడిన వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. 13వ తారీఖున కరీమాబాదులోని ఎస్ కే గౌడ్ స్మారక కళాభవనంలో ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు కార్పొరేటర్ మరుపల్ల రవి మందులను ఉచితంగా అందజేశారు. ఉచిత వైద్య శిబిరంలో 65 మందికి రోగాలను గుర్తించి మందులను అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు డాక్టర్ అనిత సలహాలు, సూచనలు ఇచ్చారు. వైద్య శిబిరంలో డాక్టర్ అనిత, ఏఎన్ఎం మంజుల, అనిత, సుధా, అనిత, వీణ, పద్మ, ప్రభాకర్ కృష్ణవేణిలు ఉన్నారు.

# ప్రొఫెసర్ గుజ్జుల రాజయ్య సంస్మరణ సభ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గుజ్జుల రాజయ్య సంస్మరణ సభ వేడుకలు హనుమకొండలోని శ్రీ కళ్యాణి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ విద్యావంతుల వేదిక (టీజీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, తెలంగాణ విద్యావంతుల వేదిక (టీజీఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గౌడ్ లు గుజ్జుల రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# గుండెను భద్రంగా చూసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గుండెనుభద్రంగా ఆరోగ్యంగా చూసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గుండె సంబంధ వ్యాధులు రాకుండా ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని హనుమకొండ సాయిబాబా మందిర చైర్మన్ మత్తుకు మల్లి హరగోపాల్ అన్నారు. డాక్టర్ అనిల్ హార్ట్ కేర్ ఆసుపత్రి వారు గురువారం సాయిబాబా మందిరంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సుమారు 200 మంది భక్తులకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బన్న అనిల్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న 108 మందికి ఈసీజీ తీసి వైద్య సలహాలు ఇచ్చారు. ఆసుపత్రి సిబ్బంది భక్తులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మందిర ధర్మకర్తలు వెయ్య గళ్ల రమేష్, రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్, సిబ్బంది బోయిన రాజేష్, పూల రాజు, మందిర సిబ్బంది రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మన్యూనత భావం వీడాలి

## భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



**వరంగల్ వాయిస్, కాటారం :** గ్రామీణ నేపథ్యం, పేదరికం, పోటీపరీక్షల సన్నద్ధతకు అడ్డు కాదని, సాధించాలన్న దృఢ సంకల్పం, పక్కా ప్రణాళికతో, పట్టుదలతో చదివితే విజయం వరిస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ సహకారంతో కాటారంలోని బీఎల్ఎం గార్డెన్ లో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే 60 మంది నిరుద్యోగ యువతకు ఎస్పీ కిరణ్ ఖరే స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ పేదరికంతో పోటీ పరీక్షలకు దూరమవుతున్న అటవీ గ్రామాల నిరుద్యోగ అభ్యర్థులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని, భవిష్యత్తులో ఉత్తమ అధ్యాపకుల చేత శిక్షణ ఉంటుందని, యువత మంచి స్థాయికి చేరుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడం సులువు కాదని, గట్టిగా ప్రయత్నిస్తే, అసాధ్యం ఏమీ ఉండదని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. నిరంతర శ్రమ, అహర్నిశలు కృషి చేసినప్పుడు కోరుకున్న స్థాయికి చేరుకోగలమని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే నిరుద్యోగ అభ్యర్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ రికగ్నైజ్ డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రేస్మా ) కాటారం అధ్యక్షుడు శ్రీశైలం, మహాదేవ పూర్ చీర్ల తిరుపతి రెడ్డి, కాటారం, మాహాదేవ్ పూర్ సీఐలు నాగార్జున రావు, రాజేశ్వరరావు, కాటారం, కాళేశ్వరం, కొయ్యూరు, అడవి ముత్తారం, ఎస్సైలు అభినవ్, భవాని సేన్, నరేష్, మహేందర్, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

# సమర్ధమైన విధానాలతో పర్యావరణ పరిరక్షణ



**వరంగల్ వాయిస్, కేయూ :** "సమర్ధవంతమైన విధి విధానాల వల్ల పర్యావరణ పరిరక్షణ" అని విశ్రాంత రసాయన శాస్త్ర ఆచార్యులు సోము శ్రీహరి అన్నారు. విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ సెమినర్ హాల్ లో విభాగ అధిపతి ఆచార్య టి సవితా జ్యోత్స్న సారధ్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో "పర్యావరణ కాలుష్యం"అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేశారు. ముఖ్యంగా వ్యవసాయంలో సాగు భూమిపై విచ్చలవిడిగా పరిమితికి మించి రసాయనాల వాడకం, గృహ, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవటం, ఉపాధి, వ్యవసాయం పేరుతో అటవీని నాశనం చేయటం, నగరాలు, పట్టణాలలో చెట్లను పెంచలేక పోవటం, సాంకేతికత అభివృద్ధి తరుణంలో ఆధునిక యంత్రాలు, వాహనాల ద్వారా వచ్చే ధ్వని, వాయు కాలుష్యంతో మానవ జీవనంపై అత్యంత ప్రభావం చూపెడుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహ కలిగి ఉన్నప్పుడే భూ గ్రహాన్ని కాపాడగలమన్నారు. కేవలం ప్రభుత్వంపై బాధ్యత పెట్టటం కూడా సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా మంజుల బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగ నూతన అధిపతిగా డా.జి.మంజుల ప్రస్తుత విభాగ అధిపతి సీజే. శ్రీలత నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డా.జి.మంజుల 2010 సంవత్సరంలో సహాయ ఆచార్యులుగా ప్రవేశించారు, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఎన్ సీసీ ఆఫీసర్ గా కుడా పని చేశారు. 2019-2021 సంవత్సరాలలో భౌతిక శాస్త్ర విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా కూడా పని చేశారు. 22కి పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. ఉత్తమ ఎన్సీసీ ఆఫీసర్ గా, అంతర్జాతీయ ఉత్తమ పరిశోధన పత్ర అవార్డులు పొందారు. డాక్టర్ మంజులను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# విద్యా హెర్బ్స్ కారం మిల్లును మూసివేయాలి

## మూకుమ్మడిగా కదిలిన మరిపెడ గ్రామస్తులు

### జిల్లా అధికారులకు వినతి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మున్సిపల్ కేంద్రంలో గత కొంతకాలంగా విషవాయువులు వెదజల్లుతున్న విద్యా హెర్బ్స్ ఫ్యాక్టరీని తక్షణమే మూసివేయాలని మరిపెడ గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కేంద్రంలోని డా.అంబేద్కర్ విగ్రహం వద్ద తొలుత సమావేశమై మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామికి విద్యా హెర్బ్స్ కారం మిల్లు వల్ల గ్రామంలో జరుగుతున్న అనర్థాలు, ప్రజల అరోగ్య దుస్థితిపై వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజుకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ కు విద్య హెర్బ్స్ మూలాన మరిపెడతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం కలుగుతుందని వివరించారు. ఇప్పటికే కారం మిల్లు వ్యర్థాలతో గ్రామం శివారులోని నల్లచెరువు కలుషితమై, చేపల ఉత్పత్తి పూర్తిగా దెబ్బ తిందన్నారు. నీరు కలుషితమై మూగ జీవాలు నీళ్లు తాగటం లేదన్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాల వలన సమీపంలోని పంట పొలాలు, మామిడి తోటల్లో ఉత్పత్తి తగ్గిందన్నారు. అక్రమ సమాచారంతో వివిధ ప్రభుత్వ శాఖల అనుమతులను తెచ్చుకొని మిర్చి ఫ్యాక్టరీ నిర్మించారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న విద్య హెర్బ్స్ మిర్చి ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంట్ల గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ అజీజ్, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, వేర్మరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కుడితి నరసింహారెడ్డి, పర్వతం చంద్రశేఖర్, ఉడుగుల రాజు, వంగవీటి భరత్, ఉప్పల సతీష్, గంధం భద్రయ్య, బాషిపంగు శివ, వెన్నె భరత్, బాలనాగు శివ శంకర్, అజయ్ చారి, బాల కృష్ణ చారి, సాదిక్, గంధం వీరన్న, నిర్మల రాజు, గంధసిరి చొక్కం తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ



**వరంగల్ వాయిస్, మామునూరు:** నాలుగో బెటాలియన్ అన్యువల్ ఇన్స్పెక్షన్ లో భాగంగా టీజీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ గురువారం నాలుగో బెటాలియన్ ను సందర్శించి బెటాలియన్ వెల్ఫేర్ గ్రూప్, క్వాటర్ మాస్టర్ గ్రూప్, మోటార్ ట్రాన్స్ పోర్ట్ గ్రూప్, పోలీస్ పెట్రోల్ పంపు, ట్రైనింగ్ గ్రూప్, హాస్పిటల్, హెడ్ క్వార్టర్ కంపెనీలను సందర్శించి వాటి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది ప్రదర్శించిన కవాతును వీక్షించారు. తదుపరి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఐజీ మాట్లాడుతూ నాలుగవ బెటాలియన్ లో చాలా ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బెటాలియన్ పచ్చదనంతో పరిశుభ్రంగా ఉందన్నారు. సిబ్బంది అందరూ చాలా నిబద్ధతతో క్రమశిక్షణతో ఉన్నారని, బెటాలియన్ రికార్డ్స్ అన్ని చాలా చక్కగా నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం కార్యక్రమంలో కమాండెంట్ శ్రీ డి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ డీఐజీ ఎంతో విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని తప్పకుండా పాటిస్తామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్అన్వేషిని, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి ,వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, వెంకటేశ్వర్లు, కృష్ణ, అధికారులు మినిస్ట్రీయల్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



# యూ బ్లడ్ ఆప్‌పై అవగాహన

## కూరపాటి హాస్పిటల్ లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కూరపాటి హాస్పిటల్‌లో జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గురువారం యూ బ్లడ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సర్జన్ డా.కూరరపాటి రమేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డా.కూరపాటి రాధిక, హాస్పిటల్ సిబ్బంది, పేషంట్స్ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా రమేష్ మాట్లాడుతు యూబ్లడ్ ఆప్ అనేది కష్ట కాలంలో ప్రాణాపాయ స్టితిలో పేషెంట్ కు డోనర్ కు మధ్య వారధిగా పని చేస్తుందని, ఎమర్జెన్సీ సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యూ బ్లడ్ ఆప్ అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యూ బ్లడ్ ఆప్ సృష్టికర్త యూబ్లడ్ ఫౌండర్ డా.జగదీశ్ బాబు యలమంచిలిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ యూబ్లడ్ ఆప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, మరో 10 మందికి అవగాహన కల్పించాలని కోరారు. సీనియర్ గైనకాలగజిస్ట్ డా.కూరపాటి రాధిక మాట్లాడుతు మహిళలకు ప్రెగ్నెన్సీ సమయంలో తగిన రక్తం అందుబాటులో లేక గర్భిణీ స్త్రీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సందర్భాలలో ప్రాణాలు కోల్పోతున్నారని బాధను వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యూ బ్లడ్ ఆప్ అనేది నిరుపేద కుటుంబాలకు ఒక గొప్ప సంజీవని అని పేర్కొన్నారు. చిలువేరు శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వ్యక్తపరిచారు.

# వేతనాలు వెంటనే చెల్లించాలి

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బస్తీ దావఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులైన వైద్యాధికారి, నర్సింగ్ ఆఫీసర్, సపోర్టింగ్ స్టాఫ్ మూడు నెలల వేతనాలు మార్చి, ఏప్రిల్, మే జీతాలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ను ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సంఘం కోరింది. అలాగే, 104 వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత 6 నెలలుగా వేతనాలు లేవని, 104లో పనిచేస్తున్న వివిధ క్యాడర్ లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు, ఏఎన్ఎంలకు, ఫార్మసిస్ట్ లకు, డ్రైవర్లకు, ఉద్యోగులకు 6నెలల అనగా డిసెంబర్ నుంచి మే వరకు వేతనాల రాలేదన్నారు. గురువారం నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సంఘం రాష్ట్ర నాయకుడు, ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ 104 సిబ్బంది, ఉద్యోగులకు 6 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఈఎంఐ, ఇంటి అద్దె, కరెంట్ బిల్లు , నిత్యావసర వస్తువులు రేషన్ కు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సిబ్బందికి వేతనాలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చర్య తీసుకోని సమస్యను పరిష్కరించాలనిడిమాండ్ చేశారు. లేకుంటే మెరుపు సమ్మెకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు.

# ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను అరికట్టాలి

## గ్రామీణ వైద్యుల భారీ ర్యాలీ

## అంబేద్కర్ విగ్రహానికి వినతి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపీ, పీఎంపీలపై చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అనుపురపు వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో పాల కేంద్రం నుంచి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనపురపు వెంకన్న, ఎస్ కే అంకూష్ లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక చిన్నచిన్న వ్యాధులతో బాధపడుతున్న వారు గ్రామీణ వైద్యుల దగ్గరికు వచ్చి ప్రథమ చికిత్స చేయించుకుంటుంటే ఆర్ఎంపీ, పీఎంపీలను భయభ్రాంతులకు గురి చేసేలా దాడులు చేయడమే కాకుండా, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను నకిలీ వైద్యులని కించపరచడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో యజమాన్యం ప్రోద్బలంతో గ్రామీణ వైద్యులపై దాడులు నిర్వహించడం సరికాదన్నారు. గత 30 సంవత్సరాల క్రితం నుంచి ప్రభుత్వాలు గ్రామీణ వైద్యులకు హామీలు ఇవ్వడం తప్ప, ఏ ఒక్క హామీని నెరవేర్చిన దాఖలాలు లేక పోవడమే కాకుండా ప్రభుత్వాలు మారినప్పుడల్లా మాపై దాడులు నిర్వహిస్తూ కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ వైద్యులపై నిర్వహిస్తున్న దాడులను తక్షణమే నిలిపివేసి గ్రామీణ వైద్యులను ప్రభుత్వ వైద్యులుగా గుర్తించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. లేదంటే, గ్రామీణ ప్రాంతాలలో 1000 మందికి ఒక ఎంబీబీఎస్ డాక్టర్ ను కేటాయిస్తే మేమే స్వచ్ఛందంగా ప్రథమ చికిత్స చేయడం నిలిపివేస్తామని, వెయ్యి మందికి ఒక ఎంబీబీఎస్ డాక్టర్లు నియమించే సత్తా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉందా...? అని సవాల్ విసిరారు. ఇకనైనా, రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపీ, పీఎంపీలపై నిర్వహిస్తున్న దాడులను నిలిపివేయాలని కోరారు. లేకుంటే గ్రామీణ వైద్యులంతా కలిసికట్టుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు సింగారపు భీమయ్య, షేక్ అంకూష్, సత్యం, హనుమంతు, అంబదాస్, గద్దల వెంకటేష్, నవీన్, ప్రకాష్, క్రాంతి, రాజమౌళి, ప్రభాకర్, సారయ్య, బాలాజీ, రవి, కమలాకర్, మండలంలోని అన్ని గ్రామాల గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# మొరం తవ్వకాలకు అడ్డుకట్ట

## వరంగల్ వాయిస్ కథనానికి స్పందన


జోరుగా మొరం దందా
వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలింపు
దీని వెనుక ఓ కాంట్రాక్టర్ హస్తం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్లు పెద్ద చెరువు, సాకరి బోర్డు (గుట్ట) వద్ద అక్రమ మొరం దందాపై ఇరిగేషన్ ఆఫీసర్లు ఎట్టకేలకు గురువారం సంఘటన ప్రదేశాలను సందర్శించారు. ప్రస్తుతం మొరం తవ్వకాలను నిలిపివేసినట్లు ఐబీ డీఈ రాజు తెలిపారు. తమ సిబ్బందిని అక్కడికి పంపించామని, పర్మిషన్ తీసుకున్న తర్వాతే వర్క్ చేసుకోమని చెప్పినట్లు వివరించారు. గత 15 రోజుల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఓ కాంట్రాక్టర్ కట్ట వెడల్పు కోసం మొరం వాడుకోవడం, మట్టి వ్యాపారులు రాత్రిపూట మట్టిని అమ్ముకోవడంపై వివరణ కోరగా సదరు అధికారి జరిగిన దాని గురించి వదిలిపెట్టండి. ప్రస్తుతం పీఆర్ నుంచి పర్మిషన్ తీసుకుంటారట, అప్పుడే మట్టి తరలించుకోమని చెప్పామని తెలిపారు. కాగా, ఇదంతా ఇరిగేషన్ ఆఫీసర్లకు తెలిసే నడుస్తుందని, అయినా సంబంధిత కాంట్రాక్టర్, మట్టి వ్యాపారులపై ఇరిగేషన్ ఆఫీసర్లు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఆఫీసర్లు లంచాలు తీసుకుని డిపార్ట్ మెంట్ కు వచ్చే రెవెన్యూను నష్టపరుస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆఫీసర్లు స్పందించి సంబంధిత కింది స్థాయి ఇరిగేషన్ ఆఫీసర్లు, కాంట్రాక్టర్ , అక్రమ మట్టి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన అరూరి, చందుపట్ల కీర్తి సత్యపాల్ రెడ్డి



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** బండి సంజయ్ కుమార్ గురువారం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిగా ఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ను బీజేపీ నాయకుడు, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి సత్యపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ముంపు నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో భవిష్యత్తులో ముంపునకు గురి కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలను రూపొందించాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఐటీడీ పీ.ఓ.చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్ మహేందర్ జి, ఏఎస్పీ ఏటూరు నాగారం మహేష్ బి గితే, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి వరద సంసిద్ధత, వరద ముంపు నివారణకు చర్యలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో పంచాయతీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కూలంకశంగా సమీక్షించి సమర్థ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాలలో ప్రజలకు తాగునీరు అందించడానికి అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. వర్షకాలంలో భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో గతంలో జిల్లాలో ముంపునకు గురై ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారో అలాంటి సమస్య తిరిగి పునరావృతం కాకుండా చూడాలని, ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల సమయం వృధాగా పోయిందని, వర్షాకాల సందర్భంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదలు సంభవించే క్రమంలో ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నీరు నిల్వ ఉండకుండా ఏదో ఒక మార్గం గుండా బయటకు వెళ్లిపోయేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వరద ముంపునకు గురికాకుండా ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో, గతంలో 2023లో వరద ముంపును ఎదుర్కొనడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం జరిగిందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఇరిగేషన్, నేషనల్ హైవే, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రిసిటీ, ఇంజినీరింగ్ అధికారులు, 9 మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బడికి బాట లేక చదువు కొనసాగేదెలా!

## స్కూల్ గేటు ఎదురుగా ప్రహరీ నిర్మాణం

## సమస్య పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ మండలంలోని గుండెపూడి గ్రామంలో ఊరు పక్క తండా బడికి బాట లేక చదువు కొనసాగేదెలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల బడికి బాటలేక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమయ్యాయి. ఊరు పక్క తండా బడి స్థానికుల, దాతల సహకారంతో స్థల సేకరణ చేసి ప్రభుత్వం పాఠశాల భవనాన్ని నిర్మించింది. ఆ బడిలో 21మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. బడి పక్కన ఓ ప్రైవేట్ ల్యాండ్ ఉండగా వారు వచ్చి ఇంటి నిర్మాణం కోసం పనులు చేపట్టి బడికి ముందు బాట లేకుండా గోడను అడ్డంగా కట్టారు. ఈ నేపథ్యంలోనే మన ఊరు-మనబడి కార్యక్రమం ద్వారా గత సంవత్సరం ఈ ప్రహరి గోడ, సంపులు, మరుగుదొడ్లు, కట్టించారు. తాగునీటి కోసం నల్లాలు పెట్టించారు. అయితే స్థానికులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల బడి బాటకు అడ్డంగా గోడ నిర్మించడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత అధికారులు, మండల అధికారులు వెంటనే బడికి బాట కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రక్తదానంతో ప్రాణదాతగా నిలవండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో హీరో ఫౌండేషన్ సభ్యులు గురువారం తలసేమియా చిన్నారుల కోసం 51మంది రక్త దానం చేశారు. ఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ హీరో ఫౌండేషన్ అనేక సేవా కార్యాలు చేస్తూ సమాజం కోసం తమవంతు బాధ్యతను మరింత ఎక్కువగా రానున్నరోజులలో ఎక్కువ మందితో చేయడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ఫౌండేషన్ ప్రెసిడెంట్ బి.ప్రవీణ్, అసోసియేట్ ప్రెసిడెంట్, కే.పవన్,సెక్రెటరీ నూరోద్దిన్, జాయింట్ సెక్రటరీ, జే.సునీల్ సభ్యులు, బ్లెసన్ ఫైయిజ్, అశోక్, బెన్నెట్ తదితరుల పాల్గొన్నారు.

# 20వ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా సురేష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20 చెందిన ముల్క సురేష్ ను అఖిల భారత పద్మశాలి సంఘం 20వ డివిజన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పద్మా నగరంలోని పద్మశాలి సంఘంలో నిర్వహించిన కార్యక్రమంలో ముల్క సురేష్ నియామక పత్రాన్ని వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గోరంటల రాజు, శ్రీనివాస్, వేముల నాగరాజ్, గంజి సాంబయ్య, రంజిత్, బాల మోహన్, రాజు, కుసుమ సారంగపాణి, క్యాతం రవీందర్, పిట్టల ఉపేందర్, తదితర పద్మశాలి నాయకులు పాల్గొన్నారు.

# 14న కన్నప్ప టీజర్ విడుదల

## క్యూరియాసిటీ పెంచుతున్న టీమ్

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు అండ్ మోహన్ బాబు కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం కన్నప్ప. తొలి పాన్ ఇండియా సినిమాగా మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నాడు. పాన్ ఇండియా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజర్ లాంఛింగ్ అప్‌డేట్‌ను కౌంట్‌డౌన్ పోస్టర్‌తో మరోసారి షేర్ చేసుకున్నారు. జూన్ 14న కన్నప్ప టీజర్ గ్రాండ్‌గా లాంఛ్ కానున్నట్టు తెలియజేశారు మేకర్స్. శివుడి ఆరాధ్య భక్తుడు కన్నప్ప ఇతిహాస ప్రయాణాన్ని చూపించబోతున్నాం. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను పొందేందుకు రెడీగా ఉండండి. అంటూ మేకర్స్ అందించిన అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా కన్నప్ప టీం కన్నప్ప టీజర్ స్పెషల్ స్క్రీనింగ్ నిర్వహించారని తెలిసిందే. మంచు విష్ణు చేతిలో ఖడ్గం పట్టుకొని సమరంలో ఉన్న కన్నప్ప పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతూ సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. క్లాస్, మాస్, యాక్షన్ హీరోగా పాపులారిటీ దక్కించుకున్న బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ కన్నప్పలో కీ రోల్ పోషిస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.




# నార్నె నితిన్ శ్రీశ్రీశ్రీ రాజావారు


శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై తీస ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ , సంపద హీరో హీరోయిన్లుగా శతమానంభవతి వంటి భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన సతీష్ వేగేశ్నదర్శకత్వంలో ప్రముఖ నిర్మాత చింతపల్లి రామారావు నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్ టైనర్ శ్రీ శ్రీ శ్రీ రాజావారు. అన్ని కమర్షియల్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ సర్టిఫికెట్ పొందటంతో పాటు, సెన్సార్ సభ్యుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ.. ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ అంశాలు ఉన్నాయన్నారు. అలాగే మా దర్శకుడు సతీష్ వేగేశ్న మంచి అభిరుచి ఉన్న డైరెక్టర్‌గా పేరుందని.. ఆయన ఈ చిత్రాన్ని రూపొందించిన విధానం ప్రతి ఒక్కరిని ఎంటర్ టైన్ చేస్తుందని అన్నారు. అలాగే మా సినిమా ఇటీవలే సెన్సార్ సభ్యుల ప్రశంసలతో జ ం సర్టిఫికెట్ పొందడం సంతోషంగా ఉందని.. చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామని అన్నారు. నార్నే నితిన్, సంపద, రావు రమేష్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరయు, రమ్య, ప్రియ మాచిరాజు, భద్రం, ఆనంద్, జబర్దస్త్ నాగి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల, ఎడిటర్: మధు, పాటలు: శ్రీమణి, పబ్లిసిటీ డిజైనర్: ఈశ్వర్, పి అర్ ఓ:బి. వీరబాబు,



# సోనాక్షి వివాహం అంటూ ప్రచారం



## తనకింకా విషయం తెలీదన్న శతృఘ్నసిన్హా



ప్రముఖ బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా కొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. నటుడు జహీర్ ఇక్బాల్‌తో సోనాక్షి వివాహం జరగనుందంటూ వార్తలు వచ్చాయి. తన కూతురి వివాహంపై వచ్చిన రూమర్స్‌పై నటుడు శతృఘ్నసిన్హా స్పందించారు. వారిద్దరి ప్రేమాయణం గురించి ఇప్పటివరకు తనకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. సోనాక్షి వివాహం చేసుకోనుందని ప్రచారం జరుగుతోంది. కానీ, దాని గురించి నా దగ్గర ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయం మీడియాకు కూడా తెలుసని.. మీ కూతురి వివాహం గురించి మీకు తెలియదా అని చాలామంది నన్ను అడిగారు. నిజంగా నాకు ఈ విషయం గురించి తెలియదు. ఎందుకంటే సోనాక్షి ఇప్పటివరకు నాకేమీ చెప్పలేదు. ఒకవేళ నా కూతురి వివాహం జరిగితే.. బారాత్ ముందు డాన్స్ చేయడానికి రెడీగా ఉన్నా అని శతృఘ్నసిన్హా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ రోజుల్లో పిల్లలు తల్లిదండ్రుల అనుమతి కోరడం లేదు. కేవలం సమాచారం ఇస్తున్నారు అంతే. ఇందుకోసం వేచిచూస్తున్నాం. సోనాక్షి నిర్ణయంపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. అదే నిజమైతే..ఆ జంటను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నా అని అన్నారు. కాగా.. సోనాక్షి, జహీర్ కొన్నేళ్ల నుంచి డేటింగ్‌లో ఉంటున్నారని వదంతులు వచ్చాయి. జూన్ 23న వీరిద్దరూ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ముంబయిలో జరగబోయే ఈ వివాహానికి ఇప్పటికే కుటుంబసభ్యులు, హీరామండి బృందం సహా పలువురికి ఆహ్వానం అందినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే శతృఘ్న సిన్హా తాజాగా స్పందించారు.







# అట్టహాసంగా ప్రారంభమైన జర్నలిస్టుల క్రీడోత్సవాలు

**నాలుగు రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు**

**3 కే రన్ విజయవంతం**

**ఎంపీ కడియం కావ్య బ్యాటింగ్.. ఎమ్మెల్యే నాగరాజు బౌలింగ్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్-2024 అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 3 కే రన్ ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్ లతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ నుంచి ప్రారంభమైన రన్ ఆర్ట్స్ కాలేజ్ మైదానం వరకు సాగింది. అనంతరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను అతిధులు లాంఛనంగా ప్రారంభించారు. కడియం కావ్య బ్యాటింగ్ చేయగా ఎమ్మెల్యే నాగరాజు బౌలింగ్ వేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వర్ంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నిత్యం కాలంతో పోటీపడుతూ పనిచేసే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆటవిడుపన్నారు. జర్నలిస్టుల సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టులను తమ ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుందని అన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. క్రీడలకు తన ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ తాను మేయర్ గా ఉన్నపుడు జర్నలిస్టులకు శాయశక్తులా సహాయ సహకారాలు అందించానన్నారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ క్రీడల నిర్వహణకు క్లబ్ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. క్రీడా పటాలను జర్నలిస్టులు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకొని జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, టీయూడబ్ల్యూజే(హెచ్)143 వరంగల్ జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ కక్కెర్ల అనిల్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, బొడిగె శ్రీను, కొడిపెల్లి దుర్గాప్రసాద్, అల్లం రాజేశ్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు బూర్ల నరేందర్, సంపెట సుధాకర్, వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ నెంబర్లు వీరగోని హరీష్, దొమ్మాటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, యండీ నయీంపాషా, కమటం వేణుగోపాల్, గుండెబోయిన దిలీప్, కందుకూరి సంజీవ్, నన్నపునేని భరత్, మంచాల రాజు, బాలవారి విజయ్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, జర్నలిసులు సిద్దోజు రాకేశ్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కెమెరామెన్స్ టీం విజయం..

ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో మధ్యాహ్నం కెమెరామెన్స్ టీం-స్మాల్ న్యూస్ పేపర్స్ వారియర్స్ జట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డికి క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి సదయ్య, కోశాధికారి అమర్ క్రీడాకారులను పరిచయం చేశారు. అనంతరం జరిగిన క్రికెట్ పోటీలో కెమెరామెన్స్ టీం 12 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసి స్మాల్ న్యూస్ పేపర్స్ టీంపై విజయం సాధించారు. ప్రెస్ క్లబ్ భవనంలో చెస్, క్యారమ్ పోటీలను నిర్వహించారు. పలువురు జర్నలిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com